క్లుప్తంగా

వీధి దీపాలకు మరమ్మతులు



వీధి లైట్ మార్చుతున్న పంచాయతీ సిబ్బంది

కోటవురట్ల: కె.వెంకటాపురంలో మంగళవారం వీధి దీపాలకు మరమ్మతులు చేపట్టారు. 5వ వార్డులోని పలు వీధుల్లో దీపాలు కాలిపోవడంతో స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్పంచ్ పైల శ్రీదేవి మంగా ఇందిర భవానీ చర్యలు చేపట్టారు. కాలిపోయిన బల్బులను మార్చి కొత్తని అమర్చారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

గ్యాస్ కనెక్షన్ కేవైసీకి భారీగా జనం



కె.వెంకటాపురంలో కేవైసీ చేయించుకుంటున్న వినియోగదారులు

కోటవురట్ల: కె.వెంకటాపురంలో భారత్ గ్యాస్ వినియోగదారులకు కేవైసీ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత గ్యాస్ సిలిండర్ల పథకానికి కేవైసీ తప్పనిసరి కావడంతో గ్యాస్ ఏజెన్సీ సిబ్బంది కేవైసీ పనులు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో వినియోగదారులు తమ గ్యాస్ కనెక్షన్‌కు కేవైసీ చేయించుకునేందుకు వచ్చారు.

10న పాటిపల్లిలో గిరిప్రదక్షిణ



గిరి ప్రదక్షిణ కరపత్రాలు ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే విజయకుమార్

మునగపాక: పాటిపల్లిలోని శ్రీఅహోబిల లక్ష్మీ నరసింహస్వామి ఆలయ పరిధిలో ఈ నెల 10న నిర్వహించనున్న గిరి ప్రదక్షిణను విజయవంతం చేయాలని ఎమ్మెల్యే సుందరపు విజయకుమార్ కోరారు. ఈ మేరకు మంగళవారం కరపత్రాలను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ భక్తి భావాలను పెంచుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, ఆడారి గోవింద, తదితరులు పాల్గొన్నారు.

పైప్‌లైన్‌కు మరమ్మతులు

మునగపాక: మెలిపాక గ్రామంలో తాగునీటి సమస్య తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నామని సర్పంచ్ అయినంపూడి విజయ భాస్కరరాజు తెలిపారు. గ్రామంలో పాడైన తాగునీటి పైపులను తొలగించి మంగళవారం కొత్తవి ఏర్పాటు చేశారు. ఈ పనులను ఆయన పరిశీలించారు. గ్రామంలో ఎక్కడైనా తాగునీటి సమస్య ఉంటే పాలకవర్గం దృష్టికి తీసుకురావాలన్నారు.


కృష్ణావతారంలో పాండురంగ స్వామి



కృష్ణావతారంలో దర్శనమిచ్చినస్వామి

పాయకరావుపేట: పట్టణంలోని శ్రీరాధా రుక్మిణీ సహిత పాండురంగ స్వామి భక్తులకు మంగళవారం కృష్ణావతారంలో దర్శనమిచ్చారు. ధనుర్మాస ఉత్సవాలు, దశావతారాల్లో భాగంగా కృష్ణావతారం అలంకరణలో స్వామిని భక్తులు దర్శించుకుని తరించారు.

'పది'లో ఉత్తమ ఫలితాలు సాధించాలి



భోజనం రుచి చూస్తున్న ఎంఈవో శివనాయుడు

మునగపాక: మధ్యాహ్న భోజన పథకాన్ని సక్రమంగా నిర్వహించాలని ఎంఈవో బుద్ద శివనాయుడు కోరారు. గణపర్తి హైస్కూల్‌ను మంగళవారం ఆయన సందర్శించారు. పదో తరగతి విద్యార్థులతో మాట్లాడుతూ పదిలో మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఉపాధ్యాయులు కూడా చదువులో వెనుకబడిన పిల్లలపై దృష్టి సారించాలన్నారు. అనంతరం మధ్యాహ్న భోజన పథకాన్ని పరిశీలించి నిర్వాహకులకు సూచనలు, సలహాలు ఇచ్చారు.

ముంచేస్తున్న నకిలీ మందులు


నకిలీ మందులు రైతులను ముంచేస్తున్నాయి. విచ్చలవిడిగా మార్కెట్లో చలామణీ అవుతున్న నకిలీ మందులను అరికట్టడంలో అధికారులు విఫలమవుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. నకిలీ బెడదతో చేతిచమురు వదులుతుందే తప్ప పంటను మాత్రం కాపాడుకోలేకపోతున్నారు. సరైన సమయంలో ఏ మందులు వాడాలో ఉద్యానవన శాఖాధికారుల సలహా తీసుకుంటే నష్టం నుంచి తప్పించుకునే అవకాశం ఉంటుంది.



విరబూసిన పూత

జీడి పూతకు మంచు కాటు

- మాడిపోతున్న పూత
- కాపాడుకునే ప్రయత్నంలో రైతుల అవస్థలు



మాడిపోతున్న మామిడి పూత

కోటవురట్ల: రైతు జీవిత కాలమంతా పరీక్షలే. కృషి, అదృష్ట, దురదృష్టాల మధ్య రైతుకు నిరంతరం పోరాటమే. ఏ సమయం కలిసొస్తుందో.. ఏ సమయం కాటేస్తోందో తెలియని త్రిశంకు స్వర్గంలో ఊగిసలాట తప్పదు. ఎన్నో ఆశలతో కంటికి రెప్పలా కాపాడుకుంటూ వస్తున్నా ప్రకృతి కన్నెర్ర చేస్తే నష్టం తప్పని పరిస్థితి. రైతన్నకు ఆటుపోటులు ఎదురైనా.. ప్రకృతి పరీక్షించినా.. మళ్లీ మళ్లీ రెట్టింపు ఉత్సాహం, ఆశతో సాగుకు ముందుకు సాగక తప్పదు. ఖరీఫ్ సీజన్‌లో అన్నదాత నష్టం నుంచి తప్పించుకోలేక పోయాడు. ఇక మిగిలిన ఆశంతా జీడి, మామిడి పంటల ఫలసాయం పైనే. ఆదిలోనే మంచు రూపంలో జీడి రైతును ఆందోళనలో ముంచేస్తోంది. పలు ప్రాంతాలలో మామిడి పూత విస్తారంగా వచ్చి రైతుల్లో ఆశలు పెంచేసింది. అయితే 15 రోజులుగా కమ్ముకుంటున్న పొగ మంచు రైతు కొంప ముంచేలా ఉంది. ఇప్పటికే జీడి, మామిడి తోటలకు అప్పులు చేసి మరీ ఎరువుల రూపంలో పెట్టుబడి పెట్టారు.

విస్తారంగా సాగు

అనకాపల్లి జిల్లాలో వరి తర్వాత అత్యధికంగా సాగులో ఉన్న పంట జీడి, మామిడి పంటలే. అనకాపల్లి జిల్లాలో 58,134.88 ఎకరాలలో జీడి తోటలు, 17,107.62 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. పాయకరావుపేట నియోజకవర్గంలో 16,041.17 ఎకరాలలో జీడి, 8,573.91 ఎకరాలలో మామిడి తోటలు సాగులో ఉన్నాయి. జిల్లాలో అత్యధికంగా నాతవరం మండలంలో 8,739 ఎకరాలలో జీడి తోటలు, నక్కపల్లి మండలంలో 5626 ఎకరాలలో మామిడి తోటలు ఉన్నాయి. మెట్ట భూములు ఎక్కువగా ఉన్న నాతవరం, కోటవురట్ల, నక్కపల్లి మండలాల్లో అధిక శాతం రైతులు జీడి, మామిడి పంట ఫలసాయంపైనే ఆధారపడి జీవిస్తున్నారు. పిందె ఏర్పడ్డాక చాలా మంది రైతులు తోటల్లో మకాం పెట్టి పంటను కాపాడుకునేందుకు నానా అవస్థలు పడతారు. పొగమంచు కారణంగా జీడిలో టీ దోమ, మామిడిలో తేనె మంచు పురుగు ఉధృతి పెరిగే ప్రమాదం ఉంది. దీంతో పూత మాడిపోయి పిందె ఏర్పడే అవకాశాలు తక్కువగా ఉంటాయి.



జీడి మొక్కలపై పురుగు మందు స్ప్రే చేస్తున్న రైతు

మండలం	జీడి తోటలు (ఎకరాల్లో..)	మామిడి తోటలు (ఎకరాల్లో..)
కోటవురట్ల	7,501.17	1,234.27
నక్కపల్లి	4,829.14	5,626.43
పాయకరావుపేట	2,026.01	819.39
ఎస్.రాయవరం	1,684.85	893.82

పొగ మంచు ఆందోళన కలిగిస్తోంది..



కొద్ది రోజులుగా పొగమంచు దట్టంగా కురుస్తోంది. పొగమంచు కారణంగా ఏటా నష్టం తప్పడం లేదు. పూత బాగున్నా పొగ మంచుతో తెగుళ్ల వ్యాపించి మాడిపోతోంది. పూత నిలబడేందుకు పురుగుల మందులు స్ప్రే చేస్తున్నాం.

–టి.రామసత్యనారాయణ, రైతు, కె.వెంకటాపురం

పూత నిలబడేందుకు చర్యలు తీసుకోండి



ప్రస్తుతం పొగమంచు ఎక్కువగా ఉంది. దీని కారణంగా జీడిలో టీ దోమ, మామిడిలో తేనెమంచు పురుగు ఉధృతి పెరుగుతుంది. ఈ కారణంగా పూత మాడిపోయి తీవ్ర నష్టం వస్తుంది. టీ దోమ నివారణకు లీటరు నీటిలో 1.6 మి.లీ మోనోక్రోటోపాస్‌తో పాటు 3 గ్రా. బ్లెట్టాక్స్ కలిపి పిచికారీ చేయాలి. తేనె మంచు పురుగు నివారణకు 4 లీటర్ల నీటిలో 1 మి.లీ ఇమిడా క్లోరిఫైడ్ మందును కలిపి పిచికారీ చేయాలి. పిచికారీ తెల్లవారుజామున, సాయంత్రం సమయాలలో మాత్రమే చేయాలి. ఎండలో స్ప్రేచేయకూడదు. పూత, కాండం, చెట్టు మొదలు తడిసేలా స్ప్రేచేయాలి. పూత విచ్చుకున్న దశలో స్ప్రే చేయకూడదు. ఆకు, పిందె దశలో మాత్రమే మందు స్ప్రేచేయాలి.

–శిరీష, ఉద్యానవన శాఖాధికారి, పాయకరావుపేట

అపరాల సాగులో యాజమాన్య పద్ధతులు పాటించాలి



మూలజంపలో రైతులతో మాట్లాడుతున్న వ్యవసాయాధికారులు



మంగవరంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

రాంబిల్లి(యలమంచిలి): అపరాల సాగులో మేలైన యాజమాన్యాలు పద్ధతులు పాటించాలని రాంబిల్లి వ్యవసాయాధికారి సిహెచ్.సుమంత అన్నారు. రాంబిల్లి మండలంలో మూలజంప, మామిడివాడ గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతులకు అపరాలు, తదితర పంటల సాగుకు సంబంధించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మూలజంప గ్రామంలో సరైన యాజమాన్య పద్ధతులు పాటించకుండా చాలా సంవత్సరాలుగా విశ్వమిత్ర అనే చెరకు రకాన్ని సాగు చేస్తున్నందున దిగుబడి గణనీయంగా తగ్గిందన్నారు. రైతులు మేలైన చెరకు రకాలైన 2009–ఎ–107 లేదా 2010–ఎ–229 సాగు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మూలజంప సర్పంచ్ వేగి అచ్చియ్యనాయుడు, వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

పాయకరావుపేట: మండలంలోని మంగవరం, గోపాలపట్నం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్ర సందర్శన చేశారు. ప్రకృతి వ్యవసాయం, వ్యవసాయ పథకాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో వీఏఏ ఆర్.సాధన, సతీష్, తదితరులు పాల్గొన్నారు.

దివ్యాంగ పింఛన్ల పరిశీలన



కోటవురట్లలో పరిశీలన చేస్తున్న వైద్యాధికారి

కోటవురట్ల: మండలంలో దివ్యాంగుల పింఛన్ల పరిశీలన మంగళవారం జరిగింది. వైద్యాధికారుల బృందం కేజీహెచ్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రదీప్, డాక్టరు జగన్నాథం, కె.వెంకటాపురం పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ సంతోష్‌కుమార్, ఎంపీహెచ్ఈవో గోవిందరావు పింఛనుదారుల వద్దకు వెళ్లి పరిశీలించారు. ఎంపీడీవో కాశీవిశ్వనాథరావు మాట్లాడుతూ మండలంలో 18 దివ్యాంగ పింఛన్లను ప్రత్యేక బృందం పరిశీలన చేసినట్టు తెలిపారు. పరిశీలనలో గుర్తించిన అంశాల నివేదికను ఉన్నతాధికారులకు పంపిస్తామన్నారు.

గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్ శంకుస్థాపనకు ఏర్పాట్లు



ఏర్పాట్లను పరిశీలిస్తున్న అధికార పార్టీ నేతలు

అచ్యుతాపురం: మండలంలోని పూడిమడక సమీపంలో గ్రీన్ హైడ్రోజన్ ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్ ఏర్పాటుకు సంబంధించి బుధవారం విశాఖ నుంచి వర్చువల్ విధానంలో ప్రధాని మోదీ శంకుస్థాపన చేయనున్నారు. ఈ శంకుస్థాపన దృశ్యాలు వీక్షించేలా సభ, టీవీలను పూడిమడకలో ఏర్పాట్లు చేశారు. కొత్తపేట ఎమ్మెల్యే బండారు సత్యానందరావు, రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు సభా స్థలిని పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్లాంట్ ఏర్పాటుతో నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు మెరుగుపడనున్నాయని తెలిపారు. ప్రధాని రోడ్డు షోకు జనాన్ని తరలించాల్సిన పరిస్థితిలో ఇక్కడ జరిగే కార్యక్రమానికి సైతం ప్రజలను సమీకరించాల్సి రావడంతో కూటమి నేతలు నానా హైరానా పడుతున్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాజాన రమేశ్ కుమార్, ధూళి రంగనాయకులు, జనపరెడ్డి శ్రీనివాసరావు, బైలపూడి రామదాసు, తదితరులు పాల్గొన్నారు.

నక్కపల్లిలో బల్క్ డ్రగ్ పార్కు వద్దే వద్దు

- స్టీల్ ప్లాంట్‌ను ప్రభుత్వ సెక్టార్‌లోనే కొనసాగించాలి
- గ్రీన్ హైడ్రోజన్ ప్లాంట్‌లో స్థానికులకే ఉపాధి కల్పించాలి
- అచ్యుతాపురం కూడలిలో సీపీఎం నాయకుల నిరసన



అచ్యుతాపురం కూడలిలో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

అచ్యుతాపురం: నక్కపల్లి మండలంలో తలపెట్టిన బల్క్ డ్రగ్ పార్కుకు నిరసనగా సీపీఎం ఆధ్వర్యంలో మంగళవారం అచ్యుతాపురంలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కన్వీనర్ ఆర్.రాము మాట్లాడుతూ నక్కపల్లి ప్రాంత ప్రజలు బల్క్ డ్రగ్ పార్కు ఏర్పాటును వ్యతిరేకిస్తున్నందున కేంద్రం ఆ ప్రతిపాదనను విరమించుకోవాలని డిమాండ్ చేశారు. తీర ప్రాంత ప్రజలు ఇప్పటికే కాలుష్య కోరల్లో చిక్కుకుని అవస్థలు పడుతున్నారని చెప్పారు. విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ నిర్ణయాన్ని వెనక్కి తీసుకుని, ప్రభుత్వ సెక్టార్‌లోనే కొనసాగించాలన్నారు. అలాగే స్టీల్ ప్లాంట్‌కు సొంత గనులు కేటాయించాలని కోరారు. అచ్యుతాపురం సెజ్‌లో ఏర్పాటు చేయనున్న గ్రీన్ హైడ్రోజన్ ఎన్‌టీపీసీ పవర్ ప్లాంట్‌లో స్థానికులకు విద్యార్హతను బట్టి 75 శాతం వరకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు కె.సోమునాయుడు, రవి, జగదీశ్, వెంకట కుమార్, అప్పలరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన



సిరసపల్లిలో వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు

మునగపాక: మండలంలోని టి.సిరసపల్లిలో మంగళవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. ఈ శిబిరంలో 154 మందికి విశాఖ కేర్ ఆస్పత్రి వైద్యులు సౌజన్య, సతీష్‌లు పరీక్షలు నిర్వహించి, ఉచితంగా మందులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ మద్దాల ధనలక్ష్మి, ఎంపీటీసీ మద్దాల వీరునాయుడు, తదితరులు పాల్గొన్నారు.

కొక్కెర వ్యాధికి వ్యాక్సినేషన్



కె.వెంకటాపురంలో కోడికి వ్యాక్సిన్ వేస్తున్న పశు వైద్య సిబ్బంది

కోటవురట్ల: కోళ్లల్లో వచ్చే కొక్కెర వ్యాధి నివారణకు చర్యలు చేపట్టినట్టు పశు సంవర్థక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టరు పెట్ల నరేష్ తెలిపారు. మండలంలో ఈ నెల 2 నుంచి 31వ తేదీ వరకు టీకా ప్రక్రియ సాగుతుందని పేర్కొన్నారు. కోళ్లకు ఉచితంగా టీకాలు వేస్తున్నట్టు తెలిపారు. కోళ్లు పెంచుతున్న రైతులు తమకు దగ్గరలో ఉన్న పశు వైద్యశాలలో లేదా, రైతు సేవా కేంద్రాలలోని పశు వైద్య సిబ్బందిని సంప్రదించాలని కోరారు.

104 సేవలు సద్వినియోగం చేసుకోవాలి



మాత్రలు అందజేస్తున్న సర్పంచ్ అప్పారావు

మునగపాక: ప్రతి ఒక్కరూ 104 సేవలను సద్వినియోగం చేసుకోవాలని మునగపాక సర్పంచ్ దిమ్మల అప్పారావు కోరారు. మునగపాక పంచాయతీ కార్యాలయం ఆవరణలో మంగళవారం ఏర్పాటు చేసిన 104 సేవలను ఆయన పరిశీలించి, రోగులకు మాత్రలు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ ఆరోగ్య జాగ్రత్తలు పాటించాలన్నారు. పీహెచ్‌సీ వైద్యాధికారి విమలగిరి మాట్లాడుతూ తాజా ఆహారంతో పాటు పోషక విలువలతో కూడిన ఆహారాన్ని తీసుకోవాలన్నారు. వైద్యుల సలహాలు, సూచనల మేర మాత్రలు వేసుకోవాలన్నారు. హెచ్‌వీ లక్ష్మి, ఎంఎల్‌హెచ్‌పీ సంతోష్, వైద్య సిబ్బంది, తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

పైడితల్లి స్వదేశీ మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నిక



సొసైటీ సభ్యులకు ఎన్నిక ధ్రువీకరణ పత్రం అందిస్తున్న ఎన్నికల అధికారి నాగలక్ష్మి

ఎస్.రాయవరం: సొసైటీలో ఉన్న సభ్యులు ఐకమత్యంతో మెలిగి అభివృద్ధికి బాటలు వేసుకోవాలని నర్సీపట్నం ఎఫ్‌డీవో నాగమణి సూచించారు. కొరుప్రోలు గ్రామంలో పైడితల్లి స్వదేశీ మత్స్య పారిశ్రామిక సంఘం ఎన్నిక మంగళవారం జరిగింది. సొసైటీ అధ్యక్షుడిగా పలపాల శ్రీను, కార్యదర్శిగా కర్రి నూకారాజుతో పాటు మరో ఏడుగురు సభ్యులుగా ఎన్నికయ్యారు. మత్స్యశాఖ ఆధ్వర్యంలో జరిగిన ఈ ఎన్నికకు నర్సీపట్నం ఎఫ్‌డీవో నాగలక్ష్మి ఎన్నికల అధికారిగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో స్థానిక మత్స్యశాఖ సహాయకుడు ఆబోతు రమణ, తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం నాయకుడు బాలకృష్ణకు ఘన నివాళి



బాలకృష్ణ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అచ్యుతాపురం: దివంగత సీపీఎం నాయకుడు అంగులూరి బాలకృష్ణ ప్రజా సమస్యల పోరాటంలో ఒక యోధుడిలా పని చేశారని కమ్యూనిస్టు నాయకుడు కర్రి అప్పారావు అన్నారు. తిమ్మరాజుపేటలో బాలకృష్ణ మొదటి వర్ధంతి సందర్భంగా ఆయన చిత్ర పటానికి పలువురు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా అప్పారావు మాట్లాడుతూ అచ్యుతాపురం సెజ్ కార్మికుల సమస్యలు, ఎన్ఏవోబీ, ఫార్మా కార్మికులు, నల్లబెల్లం ఉద్యమం, రైవాడ ఉద్యమాల్లో బాలకృష్ణ పోరాటాన్ని అందరూ స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ భీశెట్టి రాము, సీపీఎం సహాయ కార్యదర్శి శరగడం రామునాయుడు, మండల కన్వీనర్ ఆర్.రాము, బ్రహ్మాజీ, కర్రి ఆదినారాయణ, శరగడం ఆదిబాబు పాల్గొన్నారు.

నాయకుల గృహ నిర్బంధంపై నిరసన



అడ్డురోడ్డులో నిరసన తెలుపుతున్న సీపీఎం నాయకులు

నక్కపల్లి: బల్క్ డ్రగ్ పార్క్ శంకుస్థాపన కార్యక్రమాన్ని అడ్డుకుంటారన్న అనుమానంతో సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు ఎం.అప్పలరాజును మంగళవారం హౌస్ అరెస్ట్ చేశారు. రాజయ్యపేటలో నిర్మించే బల్క్ డ్రగ్ పార్క్‌నకు బుధవారం ప్రధాని మోదీ విశాఖ నుంచి వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేయనున్నారు. ఈ కార్యక్రమాన్ని స్థానికులు తిలకించేందుకు రాజయ్యపేట వద్ద బహిరంగ సభను ఏర్పాటు చేస్తున్నారు. అయితే కొద్దిరోజులుగా బల్క్ డ్రగ్ పార్క్‌ను స్థానిక రైతులతో పాటు వామపక్ష నాయకులు వ్యతిరేకిస్తున్నారు. నిర్వాసితులు, రైతులు తమకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ చెల్లించాలని ఆందోళన చేస్తున్నారు. బహిరంగ సభలో నిరసన వ్యక్తం చేస్తామని హెచ్చరించిన నేపథ్యంలో పోలీసులు ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా అప్పలరాజును ఎస్.రాయవరం మండలం స్వగ్రామం పి.ధర్మవరంలో గృహ నిర్బంధం చేశారు.

ఎస్.రాయవరం: సీపీఎం నేత ఎం.అప్పలరాజు గృహ నిర్బంధాన్ని వ్యతిరేకిస్తూ అడ్డురోడ్డు కూడలిలో మంగళవారం సీపీఎం మండలశాఖ నాయకులు ,కార్మికులు నిరసన తెలిపారు. శాంతియుతంగా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళుతుంటే ఇలా నిర్బంధించడం తగదన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు బత్తుల ప్రసాద్,నాగేశ్వరరావు,రమణ,కర్లం రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

ప్రధాని పర్యటనను విజయవంతం చేయాలి

మునగపాక: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పర్యటనను విజయవంతం చేయాలని మండల ప్రత్యేకాధికారి గోపాల్ కోరారు. మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ ఉద్యోగులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బుధవారం విశాఖలో పలు అభివృద్ధి కార్యక్రమాల శంకుస్థాపనకు విచ్చేస్తున్న మోదీ సభకు వెళ్లేందుకు మండలానికి 20 బస్సులు కేటాయించామన్నారు. ఎంపీడీవో ఎం.ఉషారాణి, మండల పరిషత్ సూపరింటెండెంట్ ప్రసాద్, కూటమి నేతలు దొడ్డి శ్రీనివాసరావు, టెక్కలి పరశురామ్, తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

గంటవానిపాలెంలో రెవెన్యూ సదస్సు నేడు

మునగపాక: మండలంలోని గంటవానిపాలెం గ్రామంలో బుధవారం రెవెన్యూ సదస్సు నిర్వహించనున్నట్టు తహసీల్దార్ ఎస్.ఆదిమహేశ్వరరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరిగే సదస్సును రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

సాగునీటి సంఘాల అధ్యక్షుల ఆత్మీయ సమావేశం



సమావేశమైన సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు

పాయకరావుపేట: మండలంలోని ఆయా సాగునీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షుల ఆత్మీయ సమావేశం పాయకరావుపేటలోని నీటి పారుదల శాఖ కార్యాలయం ఆవరణలో ఆదివారం ఉత్సాహంగా జరిగింది. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో ఎన్నికైన అధ్యక్ష, ఉపాధ్యక్షులను సత్కరించారు. ఈ సమావేశంలో నీటి పారుదల శాఖ మండల ఏఈ కె.శ్రీరామమూర్తి, కూటమి నాయకులు తోట నగేష్, పెదిరెడ్డి చిట్టిబాబు, చెంచలపు పద్దు, ఆయా నీటి సంఘాల అధ్యక్ష, ఉపాధ్యక్షులు పాల్గొన్నారు.